



మధ్యాహ్న భోజనంలో
కనిపించని కోడి గుడ్డు

● బిల్లులు అందక నిర్వాహకుల ఇబ్బందులు

కరీంనగర్ టౌన్, జనవరి 21: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డను అందించడం లేదు. మార్కెట్‌లో కొద్దిరోజులుగా కోడి గుడ్డు ధరలు పెరగడం, మరోవైపు మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం బిల్లులను ఇవ్వక పోవడంతో పాఠశాలల్లో విద్యార్థులకు కోడిగుడ్డు ఇవ్వడం లేదు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో సోమ, బుధ, శుక్రవారాల్లో కోడిగుడ్డును అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్కో గుడ్డుకు ఐదు రూపాయల చొప్పున మధ్యాహ్నభోజన కార్మికులకు బిల్లులను చెల్లించింది. మార్కెట్‌లో కోడిగుడ్డు ధర పెరిగినా, తగ్గినా అదే ఐదు రూపాయల చొప్పున బిల్లులను చెల్లిస్తూ వచ్చింది. ఐదారు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులను ఇవ్వక పోవడంతో చాలా పాఠశాలల్లో కోడిగుడ్డును అందించడం నిలిపివేశారు. కోడిగుడ్డు ధరలు ఆరు రూపాయలకు చేరడంతో చాలా వరకు కోడిగుడ్డు ఇవ్వడం మానేశారు. జిల్లాలో 651 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జడ్పీ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 48,715 మంది విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం సన్నబియ్యంతో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తామని చెప్పింది. కొన్ని పాఠశాలల్లో మాత్రమే అల్పాహారం అందించారు. తమకు మార్కెట్ ధరలకు అనుగుణంగా చార్జీలను పెంచడం లేదని, పెండింగ్ బిల్లులను ఇవ్వడం లేదని, పెరిగిన ధరలతో కోడిగుడ్డును అందించలేమంటూ మధ్యాహ్న భోజన కార్మికులు చేతులెత్తేశారు. మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా గుడ్డుతోపాటు ఇతర వస్తువుల ధరలను పెంచాలని, పెండింగ్ బిల్లులను ఇవ్వాలని, సన్నబియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ఎల్లంపల్లి నీటి కోసం
ఎదురు చూపులు

రెండేళ్లుగా బోసి పోయిన గంగాధర చెరువు



లక్ష్మీదేవిపల్లిలో సాగు చేసిన వరి పొలం

వేసవికి ముందే అడుగంటిన భూగర్భ జలాలు

● తీవ్ర నీటి ఎద్దడితో రైతుల దిగులు
● నారాయణపూర్ ఆయకట్టు రైతుల ఆందోళన

గంగాధర, జనవరి 21: యాసంగి వరి సాగు చేసిన రైతులకు సాగు నీటి ఎద్దడి కలవర పెడుతోంది. వానాకాలంలో భారీగా కురిసిన వర్షాలతోపాటు తెగుళ్ల సోకడంతో వరి పంట ఆశించిన దిగుబడి రాలేదు. వాన కాలం పంట నష్టాన్ని పూడ్చుకుందామని ఎన్నో ఆశలతో యాసంగిలో వరిసాగు చేశారు. బావుల్లో ఉన్న నీటితో నాట్లు వేసిన రైతులు కాలువ నీటి కోసం గంపెడు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఎండలు ముదరక ముందే భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటు తున్నాయి. దీంతో యాసంగి వరి సాగుపై రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. గంగాధర చెరువుకు గండి మరమ్మతులు పూర్తిచేసి 20 రోజులు గడిచింది. ఎల్లంపల్లి నుంచి నీటి విడుదలపై ఇప్పటికి ఏలాంటి సమాచారం లేకపోవడంతో పంటలను ఏలాకాపాడుకునేదని రైతులు దిగులు పడుతున్నారు. మరో వైపు కొందరు రైతులు బావుల్లో పూడిక తీయిస్తూ పొలలాలకు తడులందిస్తున్నారు. కొందరు బావుల్లో సైడు బోర్లు వేయిస్తూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. రిజర్వాయర్ ఎడమ కాలువ కింది 21 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. గంగాధర, మల్యాల, రామడుగు, చొప్పదండి మండలాలకు నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి సాగునీరందుతుంది. మరోవైపు ఎల్లంపల్లి నీటితో నాలుగు మండలాల్లోని పలు గొలుసు కట్టు చెరువులను నింపుతారు. ఇప్పటికే 19 వేల ఎకరాల్లో వరి సాగు పూర్తికాగా రోజుకో రెండు మడులకు బావుల్లోని నీరందిస్తు వరి పంటను కాపాడుకుం టున్నారు. మరో పదిహేను రోజుల్లో కాలువకు నీరందక పోతే వేసిన సగం వరిసాగు ఎండు ముఖం పట్టనుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి నీటిని విడుదల చేసి వరి పొలాలను కాపాడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

● నిర్వహణ ఏజెన్సీ బిల్లుల పెండింగ్

ఎల్లంపల్లి పైపులైను నిర్వహణను ఓ ఏజెన్సీకి గత ప్రభుత్వం అప్పగించింది. పైపులైను నిర్వహణ, ఎత్తిపోతల్లో ఆటంకాలను తొలగించడం లాంటి పనులను ఏజెన్సీ చూసుకుంటుంది. ఆ ఏజెన్సీకి కొన్ని సంవత్సరాలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలోని మంత్రులు ఏజెన్సీకి నచ్చజెప్పి నీటిని విడుదల చేయించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత యాసంగి నీటి విడుదలకు సన్నాహాలు చేసింది. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో నిర్వహణ పనులు చేసేందుకు ఏజెన్సీ ముందుకు రావడం లేదని సమాచారం. దీంతో నీటి విడుదల ఆలస్యమవుతుందని తెలిసింది.

బావి పూడిక తీయించిన..
- మల్లేశం, రైతు, నాగిరెడ్డిపూర్



రిజర్వాయర్ ఎడమ కాలువ నా భూమి మీదుగా పోయింది. గత యాసంగికి నీరు లేకపోవడంతో ఇప్పుడు వస్తాయో, రావోనని నాలుగు ఎకరాల్లో మొక్క జొన్న, మూడెకరాల్లో వరి సాగు చేసిన. కాలువకు నీళ్లు వస్తాయని ఆశతో పొలం సాగుచేసిన. మూడురోజులుగా నీళ్ల సరిపోకపోవడంతో పూడిక తీయించిన. అయినా నీళ్ల సరిపోవడం లేదు.

ఆలయాల్లో భక్తులకు
సౌకర్యాలు కల్పించాలి

● రాముని ప్రతిష్ఠ ప్రతి ఒక్కరూ వీక్షించాలి
● తెలంగాణ చౌక్ వద్ద సాయంత్రం 6 గంటలకు సంబురాలు
● ఎంపీబండి సంజయ్‌కుమార్



సైకత రామమందిరాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జనవరి 21: ఐదు శతాబ్దాల కల నెరవేరబోతున్న తరుణంలో సోమవారం ఆలయాలకు వచ్చే భక్తులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని, నిబంధనల పేరుతో ఇబ్బందులు సృష్టించవద్దని ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మధ్యా హ్నం అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగనున్నందున హిందు బంధువులంతా కరీంనగర్‌లోని చైతన్యపురి మహాశక్తి అమ్మవారి ఆలయం వద్దకు రావాలని కోరారు. అక్కడ రూపొందించిన అయోధ్య రామాలయ సైకత ఆలయాన్ని సందర్శించు కున్న అనంతరం నేరుగా తెలంగాణ చౌక్ వద్దకు తరలివచ్చి టపాసులు కాల్చి సంబురాలు చేసుకోవాల న్నారు. కరీంనగర్‌లోని హిందు బంధువులంతా సాయం త్రం 6 గంటలకు ప్రతి ఇంటిలో ఐదు రామజ్యోతులు వెలిగించాలని పిలుపునిచ్చారు.

● మహాశక్తి ఆలయంలో సైకత రామాలయం

సైకత శిల్ప కళాకారుడు ఆకుల వెంకటేశ్ మహాశక్తి శక్తి ఆలయం వద్ద 10 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పుతో ఇసుకతో అయోధ్య రామమందిర నమూనాను రూపొందించారు. భక్తులు సందర్శించడానికి వీలుగా సైకత రామాలయాన్ని రూపొందించారు. మంగళవారం నుంచి సైకత అయోధ్య రామాలయ రూపకల్పనకు వినియోగించిన ఇసుకను భక్తులకు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

● ముస్తాబైన మహాశక్తి ఆలయం

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా నగరంలోని మహాశక్తి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. సోమవారం ఉదయం 9 గంటలకు రామనామసంకీర్తన, శ్రీ రామరక్షా స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం, సీతారామచంద్రస్వామి అభిషేక, మన్యు సూక్త హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

మీ నమ్మకాన్ని వమ్ము చేయను..

● ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ హామీలపై కొట్లాడుదాం
● మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, జనవరి 21: 'రాజకీయ నేపథ్యంలేని కుటుంబం నుంచి వచ్చిన నన్ను సోదరుడిగా ఆదరించి, నాపై నమ్మకం, విశ్వాసంతో నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించారు.. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వం పై పోరాడుతాను' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే, గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో బీఆర్‌ఎస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ స్థాయి పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి, కృతజ్ఞతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ రాజకీయ అరంగేట్రం చేసిన నాటి నుంచి తనను ఆదరించిన పార్టీశ్రేణులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వీచడమే కాకుండా కరీంనగర్ చుట్టూ ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓటమి చెందినా, తానొక్కడినే మీ అందరి ఆశీర్వాదంతో గెలిచానన్నారు. రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ఆశించామన్నారు. ప్రజ లు ఈసారి కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. మనమంతా ఒక కుటుంబమని, గెలుపోటములను పట్టించుకోకుండా ఇదే స్ఫూర్తితో మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుదామన్నారు. మీకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ అధినాయకత్వం ఉంటుందని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని పొరపాట్లు, కొంత మంది గోడమీది పిల్లులతో కొంత నష్టం జరిగిందన్నారు. ఎంపీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయక పోవడంతో ప్రజల్లో అప్పుడే ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తమవుతోందని, రైతుబంధు, రైతు రుణమాఫీ జరుగలేదని, కరెంటు కోతలు మొదలయ్యాయని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఇతర సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో రైతులు, లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. కరీంనగర్ నియోజక వర్గంలోని కొత్తపల్లి చెరువు ఎండిపోతోందని, చాలా గ్రామాల్లో ఇప్పటికే సాగునీరు లేక పొలాలు ఎండి పోతున్నాయని, ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకో వాలని డిమాండ్ చేశారు. తాము ప్రారంభించిన మానేరు రివర్ ఫ్రంట్, దేవాలయాలు, రోడ్ల వంటి అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు. ప్రజలకిచ్చిన హామీలు, అభివృద్ధిపై ప్రతిపక్ష పార్టీగా ప్రజలకు అండగా నిలిచి పోరాడుతామని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఈనెల 24న పార్లమెంట్ స్థాయి సోషల్ మీడియా పార్టీ సమావేశాన్ని నిర్వహిస్తామని, ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ కార్య నిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవు తారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మనమంతా కలిసికట్టుగా కృషిచేస్తే ఎంపీగా వినోద్‌కుమార్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

● మాజీ ఎంపీ వినోద్‌కుమార్

మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు. తెలం గాణ రాష్ట్ర సాధన, అభివృద్ధి కోసమే టీఆర్‌ఎస్ పార్టీని స్థాపించామని, రాజ్యాధికారం కోసం కాదని, గెలుపు ఓటములతో కుంగిపోమని, తెలంగాణ అభివృద్ధి, ప్రజల కోసం పోరాడుతామని వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ త్వరలో కరీంనగర్‌కు వస్తారన్నారు. పార్టీకి, కేసీఆర్‌కు ఆది నుంచి కరీంనగర్ అండగా నిలిచిందని అన్నారు. ఎన్నికల్లో ఓటమిపై చాలా రకాలుగా ప్రచారం జరుగుతోందని, అబద్దాల పునాదులు, అమలుకు నోచుకోని హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ హామీలు ఆచరణలో సాధ్యం కావని, ఒకవేళ అమలు చేస్తే సంతోషమేనని అన్నారు. వరి ధాన్యం క్వింటాలకు 500 రూపాయల బోనస్ ఇస్తామన్నారని, ఎంత ఇస్తారో చూడాలన్నారు. మహిళలకు నెలకు 2,500 ఇస్తామని ఇంకా విధివిధానాలను ఖరారు చేయలేదని, ఆడబిడ్డలను మోసం చేయవద్దని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులు చేసుకునేందుకు వీలు లేకుండా ఆన్‌లైన్‌ను నిలిపివేశారని, తులం బంగారం ఇస్తామంటే మహిళలు ఆ పార్టీ మాటలను విశ్వసించారని, వంద రోజుల తర్వాత అమలు చేసే హామీలపై కనీసం జీవో కూడా విడుదల చేయడం లేదని విమర్శించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు స్మార్ట్‌సిటీని, తీగలగుట్టపల్లి ఆర్వోబీ మంజూరు చేయించానని, సంజయ్‌కుమార్ ఏమి అభివృద్ధి చేశారో ప్రజల్లో చర్చించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ ఎంపీగా వినోద్‌కుమార్ గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని, అందుకోసం పార్టీశ్రేణులు కృషిచేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు జమీలొద్దీన్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ పాల్గొనారు.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ టౌన్, జనవరి 21: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సరం డైరీని మంత్రి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. త్వరలో ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విడుపు శ్రీనివాస్, నలు మాసు సుదర్శనం, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఏనుగు ప్రభాకర్‌రావు, జిల్లా కోశాధికారి పి అశోక్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ పాము మోహన్, హెడ్ క్వార్టర్ సెక్రెటరీ మధుసూధనాచారి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌దీక్షితులు, కార్యవర్గసభ్యులు సత్యనారాయణ, రేవెల్లి రాజయ్య, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

పోలీసుల దూకుడు

● అక్రమదందాలపై దాడులు ● చిట్‌ఫండ్ మోసాలపై 20 మంది బాధితుల ఫిర్యాదు



కరీంనగర్ క్రైం, జనవరి 21: కరీంనగర్ పోలీసులు నెల రోజులుగా దూకుడును ప్రదర్శిస్తూ అక్రమదందాలకు చెక్ పెడుతున్నారు. సీపీ అభిషేక్ మొహంతి కఠినంగా వ్యవహరిస్తుండడంతో బాధితులు బయటకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు. సీపీ స్పెషల్‌టీంలను ఏర్పాటు చేసి అక్రమదందాలపై దాడులు చేయిస్తున్నారు. ఇప్పటికే ఇసుక అక్రమ దందాపై కొరడా ఝులిపించి 50పైగా ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. కొత్తపల్లి మండలానికి చెందిన ఇసుక మాఫియా లీడర్‌ను పిలిపించి హెచ్చరించినట్లు తెలిసింది. ఇంకోవైపున భూకబ్జాలకు సంబంధించి కార్పొరేటర్‌తో సహా బీఆర్‌ఎస్ నాయకుడిని జైలుకు పంపించారు. మరి కొందరు స్థానిక ప్రజా ప్రతినిధులపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇందులో ఒక కార్పొరేటర్ మూడు రోజులుగా కనపడకుండా పోయాడని, అతని సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తుందని సమాచారం. తాజాగా కరీంనగర్ పోలీస్‌హెడ్‌క్వార్టర్స్‌కు ఎదురుగా ఉన్న ప్రముఖ హోటల్‌పై స్పెషల్‌బ్రాంచి పోలీసులు దాడులు జరిపి 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఒక చిట్‌ఫండ్స్ సంస్థ 50 మందికిపైగా సభ్యులకు కోట్ల రూపాయలు టోకరా వేయడంతో సీపీకి 20 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై టౌన్ ఏసీపీ విచారణ జరుపుతున్నారు. కొద్ది రోజుల క్రితం ముగ్గురు సీఐలను ఐజీకి అటాచ్ చేశారు. దీంతో కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసు అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు.

చంద్రపురి కాలనీలో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, జనవరి 21: కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని చంద్రపురి కాలనీలో శనివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటిలో అగ్నిప్రమాదం జరగ్గా రూ.8 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు యూబీఐ బ్యాంక్ మేనేజర్ శ్రీరామోజు చిరంజీవి తెలిపారు. ఏసీ, ఫ్రిడ్జ్, ఇంటీరియల్ డెకోరేషన్‌తో పాటు ఇతర వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు స్వల్పంగా గాయాలయ్యాయని తెలిపారు. బాధిత కుటుంబాన్ని కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పరామర్శించి, ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కరీంనగర్ క్రైం, జనవరి 21: కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో పేకాట ఆడుతున్న 11మంది జూదరులను పట్టుకున్నామని ఒకటో టౌన్ సీఐ జె సరిలాల్ తెలిపారు. జూదరుల నుంచి లక్షా 31వేల 200 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టుబడిన జూదరులపై గేమింగ్ యాక్టు కింద కేసు నమోదు చేశామన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 21: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు కూలీగా పనిచేస్తున్న పల్లెపు సాయి(23) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. పెద్దపల్లికి చెందిన సాయి కొంత కాలంగా బొమ్మకల్ గ్రామ శివారులోని లారీ అసోసియేషన్ వద్ద నివాసం ఉంటూ కూలి పనిచేస్తున్నాడు. 15 రోజుల నుంచి పనికి వెళ్ళకుండా మద్యానికి బానిసగా మారాడు. ఈ నెల 17న మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

హుజూరాబాద్, జనవరి 21: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు గ్యారంటీలు మాత్రమే అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రూట్ మ్యాప్ లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ భూముల మీద పడితే ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయ, విశ్వవిద్యాలయాల భూములను హైకోర్టుకు ఇస్తానని అంటున్నారన్నారు. హైకోర్టును విజయవాడ లేదా నిజామాబాద్ రోడ్‌లో నిర్మించవచ్చన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రామాలయం చుట్టూ తిరగడం తప్ప ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. తెలంగాణలో నిర్మించిన ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందనేది వాస్తవమేనని, దీనిపై బీజేపీ, కాంగ్రెస్ సీబీఐ విచారణకు ఎందుకు కోరడం లేదన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీఎస్పీని బలపర్చాలన్నారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ వైష్ణవి - ఆర్.సి.పురం
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
PVR ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
PVR గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
PVR ప్రిస్టన్ మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
PVR ఆట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
PVR ఎస్2 నోమ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
INOX ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్ - అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు


భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

వేములవాడ, జనవరి 21: మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపి స్తున్న తరుణంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. సమ్మక్క సారలమ్మ దర్శనానికి ముందు రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకునే ఆనవాయితీ ప్రకారం ఆదివారం నాడు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వేము లవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తమ ఇష్ట దైవమైన రాజ రాజేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా లఘుదర్శనం అమలు చేయడం తో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రి పుర సుందరిదేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్దసంఖ్యలో భక్తులు చెల్లించుకున్నా రు. అనుబంధాలయమైన బద్దిపోచ మ్మ దేవాల యం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్త లు బద్దిపో చమ్మను దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులసంఖ్య భారీగా ఉండడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా భక్త లకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

● కొనసాగిన నిరంతర దర్శనం..

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో ఆదివారం రాత్రి స్వామివారి దర్శనం నిరంతరాయంగా కొనసాగింది. భారీగా పెరుగుతున్న భక్తుల రద్దీని తట్టుకునేందుకు ఆదివారాల్లో రాత్రిపూట శ్రీ స్వామివారి ఆలయం తెరిచి ఉంచాలని అధికారులు నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి స్వామివారి దర్శనం నిరంతరాయంగా కొనసాగించా రు. మరో నాలుగు వారాలపాటు ప్రతి ఆదివారం రాత్రి వేళ కూడా శ్రీ స్వామివారి ఆలయం భక్తుల దర్శనం కోసం తెరిచి ఉంచుతామని ఆలయ అధికారులు తెలిపారు.

ఆదివారం నుంచి సోమవారం రాత్రి వరకు నిరంతర దర్శనం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు రానున్న నాలుగు వారాల్లో ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు నిరంతర దర్శన సౌకర్యం కల్పించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఫిబ్రవరిలో సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనం కోసం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఒకవైపు మేడారం జాతర సమీపిస్తుండడం, మరోవైపు మహాశివరాత్రి పర్వదినం దగ్గర పడుతుండడంతో రాజరాజేశ్వరస్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. రద్దీ పెరుగుతున్న క్రమంలో స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సర్వదర్శనం కోసం సుమారు మూడు నుంచి నాలుగు గంటలు, కోడెమొక్కు చెల్లింపు కోసం ఐదు నుంచి ఆరు గంటలకు పైగా భక్తులు క్యూ లైన్‌లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ పరిస్థితిని అధిగమించి స్వామివారి దర్శనం త్వరగా లభించే విధంగా వచ్చే నాలుగు వారాల్లో ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు స్వామివారి ఆలయం తెరిచి ఉంచాలని ఆల య అధికారులు నిర్ణయించారు. ఆదివారం రాత్రి నిశి పూజ అనంతరం ఆలయాన్ని రాత్రంతా భక్తుల దర్శనం కోసం తెరిచి ఉంచుతారు. ఈనెల 28 తేదీ, ఫిబ్రవరి 4, 11, 18 తేదీల్లో రాత్రి వేళలో సైతం భక్తులు స్వామి వారిని దర్శించుకోవచ్చని, కోడె మొక్కు చెల్లించుకోవచ్చని ఆలయ ప్రొటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు వెల్లడించారు.

● నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ..


స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినం కావడం వల్ల ఉదయం గోదావరి నదిలో స్నానాలు చేశారు. భక్తులు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

గుమ్మడి కాయతో అయోధ్య రామ మందిరం


గుమ్మడి, క్యారెట్‌తో తీర్చిదిద్దిన అయోధ్య ఆలయం, ఇన్‌సెట్‌లో అనిల్

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కళాకారులు విభిన్న రీతుల్లో భక్తిభావం చాటుకుంటున్నారు. ఎల్లారె డ్డిపేట మండల కేంద్రానికి చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్ గుమ్మడి కాయ, క్యారెట్‌తో ఆదివారం రామ మందిరం ఆకృతిని తీర్చిదిద్దాడు. రెండు గుమ్మడి కాయలు, అర కిలో క్యారెట్ కలిపి ఆలయా న్ని త్రీడీ ఆకారంలో నాలుగు గంటల్లో 12 ఇంచుల ఎత్తు, 16 ఇంచుల పొడవు, 13 ఇంచుల వెడల్పుతో అయోధ్య రామమందిరం తయారు చేశాడు. విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజున స్థానిక సత్సంగ సదనంలో జరిగే కార్యక్రమంలో తాను తయారు చేసిన ఆలయ ఆకృతిని ప్రదర్శించనున్నట్లు కళాకారుడు అనిల్ పేర్కొన్నారు.

ఖాతాదారుడి ప్రమేయం లేకుండా రూ. లక్షా 45 వేల డ్రా

- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పెద్దపల్లి రూరల్, జనవరి 21: ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే అతని ఖాతా నుండి గత నెల 6వ తేదీ నుండి 26వ తేదీ వరకు రూ. లక్ష 46 వేల 300లను డ్రా చేశారు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న ఖాతాదారుడు లబోదిబోమంటూ ఈనెల 20వ తేదీన పెద్దపల్లి పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి మండలం గుర్రాంపల్లి గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మణ్‌గౌడ్ వ్యక్తికి పెద్దపల్లి పట్టణంలోని ఎస్‌బిఐ కమాన్ బ్రాంచిలో 00000033004053238 ఖాతా ఉంది. ఈ ఖాతా నుండి గత నెల 6వ తేదీ నుండి 26వ తేదీ వరకు రూ. లక్షా 43 వేల 300 రుపాయలు డ్రా అయ్యాయి. బ్యాంకు కువెళ్లి బ్యాలెన్స్ చూసుకునే సరికి డ్రా చేసినట్లు చూయించడంతో వెంటనే పెద్దపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దపల్లి ఎస్ఐ 2 మల్లేష్ బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం

చొప్పదండి, జనవరి 21: మండలంలోని భూపాలపట్నం శివారులోని డి-86 కాలువ వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ ఉపేంద్రాచారి తెలిపారు. కాలువ వద్ద మృతదేహం ఉన్నట్లు ఆదివారం మధ్యాహ్నం సమాచారం అందగా సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉన్నట్లు తెలిపారు. సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం చేసినట్లు, మృతి చెందిన వ్యక్తి 40 నుంచి 45 ఏళ్ల వ్యక్తిగా తెలుస్తుందని ఎస్ఐ తెలిపారు.

కొండగట్టులో సీతారాముల ఆనవాళ్లు


● రాముని పాదుకలు, సీతమ్మ కన్నీటి గుంతలు ● అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా భక్తుల మననం


రాముని పాదుకలు


సీత జలకాలు ఆడిన కోనేరు

మల్యాల, జనవరి 21: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో సీతారా ముల ఆనవాళ్లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుండగా నేడు అయోధ్యలో ని ర్వహించే బాల రాముని ప్రాణప్రతిష్ఠోత్సవం సందర్భంగా మననం చేసుకుంటు న్నారు. కొండగట్టులో శ్రీరాముని పాదుకలు, సీతమ్మ కన్నీటి గుంతలు భక్తులను తన్మయత్వానికి గురి చేస్తున్నాయి. వీటి వద్ద భక్తులు పూజలు కూడా చేస్తుం టారు. రామలక్ష్మణ, సీతా దేవిల వనవాసం సందర్భంగా రాముడు ఇక్కడికి వచ్చా డని అప్పుడు బండ రాయిపై నిలబడినప్పుడు ఏర్పడినవే ఈ పాదుకలంటూ భ క్తులు వాటిని దర్శించుకుంటుండగా అదే సమయంలో వనవాసం సందర్భంగా సీతాదేవి ఏడవడంతో కన్నీటి దారలకు ఏర్పడినవే కన్నీటి గుంతలుగా భక్తులు పసుపు, కుంకుమతో పూజిస్తుంటారు. అలాగే కొండల రాయుడి కోటపై గల నీటి గుంతను సీతమ్మ కోనేరుగా, ఇక్కడ సీత జలకాలు ఆడినట్లు భక్తులు చెప్పుకుంటారు.

ప్రభుత్వ సలహాదారుగా హర్కార వేణుగోపాల్‌రావు



గోదావరిఖని, జనవరి 21: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా (ప్రొటోకాల్ ప్రజా సంబంధాలు) హర్కార వేణుగోపాల్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశాలు జారీ చేశారు. క్యాబినెట్ ర్యాంకు హోదా కల్పించనున్నట్టు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. విలేజి రామగుండంకు చెంది న హర్కార వేణుగోపాల్‌రావు ప్రస్తుతం ఏఐసీసీ సభ్యుడిగా పని చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

మానకొండూర్, జనవరి 21: మానకొండూర్ గ్రామ శివారులో ఆదివా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానిక సీఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అన్నారం గ్రామానికి చెందిన పుసాల అక్షయ్‌కుమార్ (21) మోటార్ సైకిల్‌పై కరీంనగర్ వైపు వెల్లుతుండగా ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులకు మట్టిని తరలిస్తున్న టిప్ప ర్ డీకొందని తెలిపారు. ఈ ప్రమాదంలో అక్షయ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన


ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న శ్రీదేవసేన

సుల్తానాబాద్, జనవరి 21: అర్హులైన వారందరూ కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనీ సీనియర్ ఐఏఎస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీదేవసేన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు కావాలని సూచించారు. ఓటర్ల జాబితాను అప్‌డేట్ చేయడంలో భాగంగా ఆయా గ్రామాల్లో చనిపోం యిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని, వలస వెళ్లిన వారి పేర్లను సరి చేసుకోవాలని తెలిపారు. రెండు రోజుల పాటు ప్రత్యేకంగా ఓటర్ నమోదు కార్యక్రమం ఉమ్మడి జిల్లా పరిధిలో కొనసాగుతుందని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో తాను పరిశీలించి పలు సలహాలు సూచనలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, బీఎల్వోలు పాల్గొన్నారు.

250క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● ఒకరి అరెస్టు... ముగ్గురు పరారీ

హుజూరాబాద్, జనవరి 21: హుజూరాబాద్ పట్టణ శివారులోని కరీంనగర్ రోడ్‌లో గల ఓ రైస్‌మిల్లులో 250క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హుజూరాబాద్‌లోని సీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హుజూరాబాద్ శివారులో రేషన్ బియ్యం మిల్లుల్లో దిగుమతి అవుతున్నాయని స్పెషల్ బ్రాంచీ టాస్క్‌ఫోర్స్ అధికారుల సమాచారం మేరకు సీఐలు సంతోష్‌కుమా ర్, బొల్లం రమేష్, ఎస్ఐ రాజు దాడులు నిర్వహించారన్నారు. ఇందులో 250క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించా మన్నారు. అలాగే బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేశామన్నారు. పట్టణానికి చెందిన ఎస్ శ్రీనివాస్ అనే వ్యక్తితో పాటు పిల్లి శ్రీధర్, సురేష్, రమేష్ బియ్యం దందా చేస్తున్నారన్నారు. వీరిలో శ్రీనివాస్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. ఇతనిపై గతంలో కూడా కేసులు ఉన్నాయన్నారు. రేషన్ బియ్యాన్ని హుజూరాబాద్ డివిజన్‌లో ఎవరూ కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీడీఎస్ బియ్యం దుర్వినియోగం చేస్తే పీడీయాక్టు నమోదు చేస్తామన్నారు. మిల్లర్లు కూడా రేషన్ బియ్యం కొనుగోలు చేయవద్దన్నారు. సమావేశంలో సీఐ బొల్లం రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రుక్మాపూర్‌కు ట్రైనీ ఇంజనీర్లు


సమావేశమైన ట్రైనీ ఇంజనీర్లు

చొప్పదండి, జనవరి 21: మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్‌లోని ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్ ట్రైనీ అధికారులు శిక్షణ కోసం వచ్చారు. గోపాల్‌సింగ్, సనత్ రెడ్డి, రాంచందర్, శ్వేత ఉపాధ్యాయ్, సాక్షి ముద్లియార్, సఫల్‌లు శిక్షణ కోసం రాగా ఈ నెల 25 వరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బస చేయనున్నారు. ఎంపీపీ చిలుక రవీందర్, ఎంపీడీవో స్వరూప, ఎంపీవో రాజగోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ విజయసారథి, కార్యదర్శి మేహతబ్, ఏపీవో రాజు, ఏపీఎం నర్మద, డాక్టర్ శైలేందర్‌లు ట్రైనీ ఇంజనీర్లతో సమావేశం అయ్యారు.

బస్సుల కోసం భక్తుల ఇబ్బందులు


వేములవాడ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, జనవరి 21: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్సులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, హన్మకొండ, కోరుట్ల తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బస్సుల కోసం ఆర్టీసీ బస్టాం డ్‌లో గంటల తరబడి నిరీక్షించారు. సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భం గా వేములవాడకు భక్తుల రద్దీ పెరిగింది. అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

'బిర్లా ఓపెన్‌మైండ్స్'లో పైజామా పార్టీ



పైజామా పార్టీలో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ రూరల్, జనవరి 21: బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్లో కిండర్ గార్డెన్ పిల్లలకు ఆదివారం పైజామా పార్టీ నిర్వహించారు. కిండర్ గార్డెన్ పిల్లలకు టాటూ కార్నర్, స్టోరీ టెల్లింగ్, జ్యూస్ జంక్షన్, టీవీ తెరపై కథల ప్రదర్శన మంచ్ అండ్ వాచ్ నూతన అనుభూతిని కలిగించాయి. విద్యార్థుల నృత్యాలు, సంగీత కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ పాల్గొన్నారు.

శ్రీవైష్ణవసంఘం సమావేశం



సమావేశంలో పాల్గొన్న శ్రీవైష్ణవసంఘం బాధ్యులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 21: కరీంనగర్, సప్తగిరికాలనిలోని శ్రీవైష్ణవ సంఘ భవనంలో ఆదివారం సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేసి ఆమోదించారు. అధ్యక్షుడు పీచర కృష్ణమాచార్యులు మాట్లాడుతూ ఈ నెల28న ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఉదయం 11గంటలకు కల్యాణం, ఆత్మీయసమ్మేళనం నిర్వహిస్తామని పేర్కొన్నారు. దీనికి ఉమ్మడి జిల్లా ప్రతినిధులు, సభ్యులు, రాష్ట్ర శాఖ బాధ్యులు హాజరు కానున్నారని తెలిపారు. ప్రతీ నెల రెండో శనివారం కార్యవర్గ సమావేశం, ప్రతి శుద్ధ ఏకాదశికి ఒక సభ్యుని ఇంట్లో విష్ణుసహస్ర నామపారాయణం, జరుపుతాయని తెలిపారు. కార్యదర్శి గోవర్ధనగిరి శశికిరణ్ ఆచార్య నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో ఆచి యాదగిరి ఆచార్య, కెపిఎస్ అనంతాచార్య, కాందూరి వేంకటేశ్వర్లు, మాడభూషణి శ్రీనివాసాచార్యులు, డింగరి శ్రీనివాసా చార్యులు, నమిలకొండ అనిల్ కుమార్, మరింగంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

బంగారు మైసమ్మకు ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న మాజీ ఎంపీ వినోద్ కుమార్

కరింనగర్ కల్చరల్, జనవరి 21: హౌసింగ్‌బోర్డులో ఇంటిలో వెలిసిన బంగారు మైసమ్మ తల్లికి నారదాసు వసంత్‌రావు, స్రవంతమ్మ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అభిషేక కార్యక్రమం, ఒడిబియ్యంతో బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణరావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, పొన్నం అనిల్ కుమార్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బలగం బ్రదర్స్ నారదాసు వసంతరావు, హౌసింగ్ బోర్డ్ ఏడవ డివిజన్ ప్రెసిడెంట్ ఓ.మోహన్‌రావు, పల్లవి స్వచ్ఛంద సేవా సంస్థ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు వొడ్నాల రాజు, జక్కుల నాగరాజు, దూలం సంపత్, పెరుమండ్ల అభిషేక్, అనిల్ ముదిరాజ్, మధు పటేల్, తోడంగా హరీష్ యాదవ్ పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 21: అయోధ్య రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా చిన్మయ యువ కేంద్ర ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో యువతీ, యువకులకు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్మయ మిషన్ బ్రహ్మచారి, అక్షయ చైతన్య హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు.

క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, జనవరి 21: మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం పరిశీలించారు. క్యాంపు కార్యాలయంలో నడుస్తున్న మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ భూమారెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, కౌన్సిలర్లు పెరుమాండ్ల మానస, కొట్టె అశోక్, మునగాల చందు, జిల్లా రమేష్‌గౌడ్, కడారి శంకర్, నిజానపురం చందు, గుంటి మల్లయ్య, స్వరూపలు ఉన్నారు.

నియామకం

హుజూరాబాద్‌రూరల్, జనవరి 21: నెహ్రూ యువ కేంద్రం జిల్లా అడ్వైజరి కమిటీ సభ్యుడిగా మండలంలోని బొత్తలపల్లి గ్రామానికి చెందిన సుంకరి శ్రీరాంరెడ్డి నియమితులయ్యారు. యువజన వ్యవహారాల, క్రీడల కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెహ్రూ యువ కేంద్రం జిల్లా అడ్వైజరి కమిటీ సభ్యుడిగా శ్రీరాంరెడ్డిని నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. తన నియమాకానికి కృషి చేసిన కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



సుంకరి శ్రీరాంరెడ్డి

మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభకు పరామర్శ

సైదాపూర్, జనవరి 21: మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభను ఆదివారం పలువురు పరామర్శించారు. బొడిగ శోభ భర్త బొడిగ గాలయ్య అనారోగ్యంతో మృతి చెందగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ శోభను పరామర్శించారు. గాలయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. వారివెంట ఆకునూర్ సర్పంచ్ ముత్యాల రమణారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.



గాలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ బండి సంజయ్

బీఆర్ఎస్ పార్టీది ముగిసిన అధ్యాయం



మాట్లాడుతున్న నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జనవరి 21: బీఆర్ఎస్ పార్టీది ఇక ముగిసిన అధ్యాయమే అని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి ఓట్లు అడిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 45 రోజులు కూడా గడవక ముందే మాజీ మంత్రి కేటీఆర్ కరెంట్ బిల్లులు కట్టకండి, బిల్లులు సోనియా గాంధీకి పంపండి అంటూ చేసిన వ్యాఖ్య లను కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ భారీ మెజారిటీతో గెలవబోతోందని, కేంద్రంలో కూడా ప్రజా పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కరీంనగర్ సర్క్యూట్ గెస్ట్‌హౌజ్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని అన్నారు. పది సంవత్సరాలుగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించాడని, నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన అధికార్లు, కాంట్రాక్టర్లు బలికాక తప్పదని అన్నారు. ప్రజల సమస్యలు, అభివృద్ధిపై పూర్తి అవగాహన ఉన్న ఉమ్మడి జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులు, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిల నాయక త్వంలో అభివృద్ధితో పాటు గతంలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలుగా బీఆర్ఎస్ నాయకుల అండదండలతో కరీంనగర్ చుట్టూ భూములు కబ్జాలకు గురయ్యా యని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెడు తున్నాయని కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. సమావేశంలో నాయకులు ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, అబ్దుల్ రెహమాన్, ముదిగంటి అనిల్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, ముక్క భాస్కర్, జీడి రమేష్, ఆమెర్, మహమ్మద్‌భారీ, బషీర్, కీర్తికుమార్, సిరాజొద్దిన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా హబ్‌గా కరీంనగర్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి21: కరీంనగర్ జిల్లా క్రీడా హబ్‌గా రూపుదిద్దుకుందని రాచకొండ డీసీపీ చంద్రమోహన్ అన్నారు. కరీంనగర్ క్రికెట్ క్లబ్, సుఫా క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో జరుగుతున్న యూనిటీ కప్ క్రికెట్ లీగ్ సెమీఫైనల్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ క్రికెట్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పి యాదగిరి, పుల్లమల్ల ప్రసాద్, సుల్తానాబాద్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి సిలివేరి మహేందర్, టోర్నమెంట్ నిర్వాహకులు సురేష్ పాల్గొన్నారు.

వింధ్యావాలిలో క్రీడోత్సవాలు



సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 21: నగరంరలోని మెహర్‌నగర్‌లో వింధ్యావాలి ఉన్నత పాఠశాలలో వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభయ్యాయి. పోటీలను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ జి ప్రశాంత్‌లు క్రీడాజ్యోతి వెలిగించి క్రీడా పతాకాన్ని ఎగురవేశారు. విద్యార్థులకు కబడ్డీ, కోకో, రన్నింగ్, చెస్, క్యారమ్స్, వాలీబాల్, పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వింధ్యావాలి వైస్ చైర్మన్ ఆర్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంజనాద్రి క్షేత్రం నుంచి నగర సంకీర్తన

కరీంనగర్ కల్చరల్, జనవరి 21: అయోధ్య రామమందిర ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం నగరంలోని భగత్‌నగర్ అంజనాద్రి ప్రసన్నాంజ నేయస్వామి దేవాలయం నుంచి నగర సంకీర్తన నిర్వహించారు. ఆలయం నుంచి భగత్ సింగ్ విగ్రహం ద్వారా అంజనాద్రి కాలనీ వీధులు, రామచంద్రాపూర్ కాలనీ ద్వారా తిరిగి నగర సంకీర్తన యాత్ర ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో ఆలయ బాధ్యులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్, జనవరి 21: అల్ఫోర్స్ విద్యాసంస్థలు, లయన్స్ ఇంటర్నేషనల్, ప్రతిమ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారంర భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించారు. కార్డియాలజి, రుమటాలజి, ఎండోక్రైనాలజి, గ్యాస్ట్రో ఎంటరాలజి, పల్మనాలజి, జనరల్ మెడిసిన్, అస్తమాలజిలో ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, లయన్ హనుమాండ్ల రాజిరెడ్డి, లయన్ ఎన్‌వి రావు, డాక్టర్ బి మధుసూదన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కల్చరల్, జనవరి 21: అయోధ్య రామమందిర విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా అయోధ్య సేవా సమితి ఆధ్వర్యంలో రాంనగర్ మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హనుమాన్ చాలీసా పారాయణానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, 5 లక్షల పుష్పములతో శ్రీసీతా రామచంద్ర స్వామికి పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో పరబ్రహ్మానందగిరి స్వామీజీ, కూర్మాచలం సంతోష్ కుమార్ ఆచార్యులు, భోగ శ్రీనివాస్, కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, నాయకులు సూర్యశేఖర్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యానికి మార్షల్ ఆర్ట్స్ దోహదం



మార్షల్ ఆర్ట్స్ సర్టిఫికెట్లతో విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 21: విద్యార్థులలో ఆత్మస్థైర్యానికి మార్షల్ ఆర్ట్స్ దోహద పడుతుందని మానేరు విద్యాసంస్థల అధినేత, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్యాట్రన్ కడారి అనంతరెడ్డి అన్నారు. ఆదివారం మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో జరిగిన బ్రూస్ కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ బె ల్ట్ సర్టిఫికేట్ల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరాటేలో రాణించిన క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు బెల్టులను, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంజీవ్‌రెడ్డి. చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కోడూరి శేఖర్ పాల్గొన్నారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కాలేజీకి బెస్ట్ ప్రామిసింగ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అల్ఫోర్స్ కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్, జనవరి 21: నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలకు బెస్ట్ ప్రామిసింగ్ అవార్డు లభించింది. అంబిషన్ కెరిర్ కౌన్సిలర్స్ ఎడ్యుకేషన్ అవార్డు హైదరా బాద్ వారి ఆధ్వర్యంలో అవార్డును హైదరాబాద్‌లో కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నిర్వాహకులు శరత్, సాయిరాం చేతుల మీదుగా అందుకున్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో మౌళిక సదుపాయాలు, ప్రాంగణ నియమకాలు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఆధారంగా బెస్ట్ ప్రామిసింగ్ డిగ్రీ కళాశాలగా ఎంపికయిందన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి, జి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

గంగాధర, జనవరి 21: అర్హులైన ప్రతీఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీ) ప్రఫుల్ దేశాయ్ అన్నారు. ఆదివారం ఆయన గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా కొత్త ఓటరు నమోదు, లిస్టులో మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రమేష్‌బాబు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం ముగిసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు మండలంలోని 78 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో నూతన ఓటర్లు 278, తొలగించిన ఓట్లు 93, 155 మందికి ఓటరు జాబితాలో తప్పొప్పులను సవరించారు. నియోజకవర్గంలో నూతన ఓటర్లు 1,037, తొలగించిన ఓట్లు 391, ఓటర్ జాబితాలో 698 మంది తప్పొప్పులను సవరించారు.

గన్నేరువరం: పోలింగ్ బూత్‌ల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు మామిడాల భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌ల వద్ద నిర్వహించిన ఓటరు నమోదును ఆదివారం ఆయన పరిశీలించారు. మండలంలో బీఎల్వోలు నిర్వహించిన ఓటరు నమోదులో 162 మంది నూతన ఓటరు, సవరణలు, పేర్ల తొలగింపులు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు మాధవరావు, శ్రీధర్, అంజలి, పుష్పలత, సరోజన, రేణుక పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

హుజూరాబాద్, జనవరి 21: క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలిగిస్తాయని సేవ్ దా ట్రీస్ గౌరవ అధ్యక్షుడు, సామాజిక కర్త వర్ధినేని రవీందర్‌రావు అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలో హైస్కూల్ మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడలు జరిగాయి. ఈ సందర్భంగా పరుగు పందెం, జాగింగ్, షాట్‌పుట్, టగ్ ఆఫ్ వర్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు రవీందర్‌రావు పదివేల రూపాయల విలువ చేసే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు రాజిరెడ్డి, సొల్లు సారయ్య, రవీందర్, భాగ్యలక్ష్మి, మతిన్, శ్రీనివాస్, యాదగిరి, రత్నం పాల్గొన్నారు.

రెడ్డి సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

హుజూరాబాద్‌రూరల్, జనవరి 21: మండలంలోని జూపాక గ్రామంలో రెడ్డి సంఘం నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రూపురెడ్డి గోవర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మహేందర్‌రెడ్డి, కార్యదర్శిగా పింగిలి నారాయణరెడ్డి, కోశాధికారిగా నందికొండ నరసింహారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బొద్దిరెడ్డి సమ్మిరెడ్డి, బొద్దిరెడ్డి ప్రతాపరెడ్డి, మిల్కూరు మల్లారెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా మహేష్



ఇల్లందకుంట, జనవరి 21: మండల కేంద్రంలోని అంబే ద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని మాజీ అధ్యక్షుడు శనిగరపు రాము ఆధ్వర్యంలో ఆదివారం నియమించారు. అధ్యక్షుడిగా మారెపల్లి మహేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, హరిబాబు, శ్రీధర్, కుమార్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున డెయిరీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు



పోటీలు నిర్వహిస్తున్న డెయిరీ ఎండీ ప్రభాకర్‌రావు

హుజూరాబాద్, జనవరి 21: హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపులో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగార్జున డెయిరీ డైరెక్టర్ గణేష్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డెయిరీ ఎండీ పుల్లూరు ప్రభాకర్ క్రికెట్, టగ్ ఆఫ్ వార్, షటిల్, షాట్‌పుట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటలు మానసిక, శారీరక దృఢత్వానికి దోహదపడుతాయన్నారు. క్రీడలతో డెయిరీలో వివిధ విభాగాల్లో పనిచేసే వారి మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. గెలిచిన వారికి గణతంత్ర దినోత్సం రోజున బహుమతులు అందజేయనున్నట్లు ప్రభాకర్‌రావు తెలిపారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనం

మానకొండూర్, జనవరి 21 : మండలంలోని రంగపేట గ్రామంలో 12 ఏళ్ల క్రితం మంజూరైన అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో అప్పటి పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం గోడలు, స్లాబ్ పనులు పూర్తి అయినా ఫ్లోరింగ్, దర్వాజలు, తలుపులు, కిటికీల నిర్మాణం చేపట్టలేక అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకొని అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేడు రామ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం

కరీంనగర్ కల్చరల్, జనవరి 21: అయోధ్యలో సోమవారం జరిగే బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రభుత్వాసుపత్రి సమీపంలో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద భారీ ఎల్‌ఈడి స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపి సీనియర్ నాయకుడు పొల్సాని సుగుణాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు, భజనలు, హనుమాన్ చాలీసాపారాయణాలు జరుగుతాయన్నారు.

ముగిసిన చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 21: కరీంనగర్ విశ్వనాథ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో మూడురోజులుగా నిర్వహిస్తున్న అఖిల భారత అండర్-1600 ఫిడే రేటింగ్ చదరంగ పోటీలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సివిల్ సప్లయి మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, డాక్టర్ ధోనిశ్రీనివాస్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అంతగిరి విశ్వనాథ్‌ప్రసాద్, రాజేంద్రప్రసాద్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు గొనె శ్రీనివాస్, చీఫ్ ఆర్బిటర్ చంద్రమౌళి, పిడి ఆర్బిటర్లు సంజయ్, కుషి, సహాయకుడు కుప్పర్తి శివయ్య, ఎ.కుమార్, శ్రేయ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం

కరీంనగర్‌రూరల్, జనవరి 21: లయన్స్ క్లబ్ ఆఫ్ మంకమ్మతోట సభ్యులు కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలోని మహిళలకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. చింతకుంట గ్రామానికి చెందిన దోనపాటి సురేందర్ రెడ్డి ఆర్థికసాయంతో మహిళలకు చీరగాజులు, పువ్వులు, పండ్లతో సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చెన్నమాధవుని పవనసుత రాజు, జిల్లా కృష్ణమూర్తి, ఊటుకూరు లక్ష్మీనారాయణ, జిల్లా అంజయ్య, గుండుజు లక్ష్మయ్య, పాత శేఖర్ పాల్గొన్నారు.

సాధన స్కూల్‌లో వీడ్కోలు సంబరాలు

కరీంనగర్ టౌన్, జనవరి 21: నగరంలోని సాధన స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో ఆదివారం పదవ తరతగి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సంబురాలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ సిహెచ్.శ్రీనివాస్‌రావు, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్.నీలిమా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్ర మాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమారస్వామి, హెచ్‌ఎం. ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తేనె పరిశ్రమ కేంద్రం ప్రారంభం

మానకొండూర్, జనవరి 21 : మండలంలోని వెల్ది, లక్ష్మీపూర్ గ్రామాలలోని మామిడితోటలో ఆదివారం సహజ సిద్ధమైన తేనే తయారి పరిశ్రమ కేంద్రాన్ని జిల్లా వెల్ఫేరు అధికారి సరస్వతీ ప్రారంభించారు. ఈ పరిశ్రమతో నిర్వాహకులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆమె సూచించారు. గ్రామ సర్పంచు తుమ్మల అర్చన, పరిశ్రమల అధికారి మధులత, సఖి సెంటర్ శ్రీలత, లక్ష్మీ, అన్నారెడ్డి, నిర్వాహకులు సంజన, రఘు రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ అన్నదాన ట్రస్టు ఏర్పాటు

చొప్పదండి, జనవరి 21: చొప్పదండి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠ(అయ్యప్ప) ఆలయ అన్నదాన ట్రస్టు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడిగె వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆలయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాల ను ఆమోదించారు. ఆలయ అభివృద్ధికి సహకరించు దాతలు కమిటీ సభ్యులను సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ ఇప్పనపెల్లి సాంబయ్య, ఆలయ ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారా యణ, కోశాధికారి దండె సత్యానందం, ఉపాధ్యక్షులు బొడిగె వెంకన్న, ఎన్నం మునీందర్, మునిగాల సుధాకర్, ఎలిగేటి రాములు, కార్యదర్శి వెల్మ విజేందర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

గన్నేరువరం, జనవరి 21, యువత క్రీడల్లో రాణిస్తూ సమాజ సేవలో ముందుండాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల యువతకు క్రికెట్ కిట్లు కోసం 20 వేల నగదును శ్రీనాథ్ రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిస కావద్దని, సన్మార్గంలో నడిచినప్పుడే వారి కుటుంబాలతో పాటు గ్రామం బాగుంటుందని అన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గంగాధర, జనవరి 21: మండలంలోని బూరుగుపల్లి గ్రామపరిధిలోని బొమ్మకంటిపల్లిలో బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆదివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన బొమ్మకంటి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ నర్సయ్య కుటుంబాన్ని పరార్శించా రు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మహిపాల్ రావు, శంకర్‌గౌడ్, లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అర్చకుడి మృతి

సైదాపూర్, జనవరి 21: సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట శివాలయ అర్చకుడు మఠం కుమారస్వామి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ శివరాంపల్లికి వెళ్లి కుమారస్వామి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ కల్చరల్: గొప్ప సాహితీ కేంద్రంగా వర్ధిల్లుతోన్న కరీంనగర్ 'కవీంనగర్'గా ప్రసిద్ధికెక్కిందని సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య అన్నారు. ఆదివారం విద్యుత్ ఇంజనీర్ల భవనంలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో రచయిత, ఎల్‌ఐసి ఉద్యోగి పెనుగొండ బసవేశ్వర్ రచించిన 'ప్రశ్నను మింగిన కాలం' పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తెరవె అధ్యక్షుడు సీవి కుమార్ కార్యదర్శి దామరకుంట శంకరయ్య, అఖిల భారత తెరవే అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్: నగరంలోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో టీడీపీ రూపొందించిన ఎన్టీఆర్ 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కల్యాడపు ఆగయ్య ఆవిష్కరించారు.

●కరీంనగర్ కల్చరల్: వికాసతరంగిణి, జెట్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జ్యోతినగర్‌లోని ఆండాళ్ భవనంలో పెద్ద జీయరుస్వామి పరమపదోత్సవం నిర్వహిస్తున్నట్లు వికాసతరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు ఒక ప్రకటనలో తెలిపారు.

●గణేశ్‌నగర్: గుంటూరు కారం సినిమాలో మార్క్స్ లెనిన్ పేర్లను విలన్ల పాత్రలకు పెట్టి డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ అవమానపరిచాడని ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, డివైఎఫ్ఐ, సంఘాల నాయకులు ఆదివారం తెలంగాణచౌక్‌లో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి సురేష్. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.